నిర్మాణాల్లో భద్రత చర్యలేవీ?

- నగరంలో జోరుగా భవన నిర్మాణాలు
- ఇటీవల సెల్లార్ కోసం తవ్వకాలు జరుపుతుండగా కూలిన పక్కింటి ప్రహరీ
- కనీస నిబంధనలు పాటించని నిర్మాణ స్థల యజమానులు



నగరంలోని ఓ భవన నిర్మాణం వద్ద కూలిన పక్కింటి ప్రహరీ

నిజామాబాద్‌నాగారం: నగరంలో నూతన భవన, వ్యాపార సముదాయాల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. కానీ స్థల యజమానులు నిర్మాణాల సమయంలో కనీస భద్రత చర్యలు తీసుకోవడం లేదు. దీంతో నిర్మాణాల పక్కన ఉండే భవనాలకు ముప్పు ఉంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల నగరంలో ఓ ఇంటి నిర్మాణంలో భాగంగా సెల్లార్ కోసం తవ్వకాలు జరుపుతుండగా పక్కనే ఉన్న ఇంటి ప్రహరీ కూలిపోయింది. దీంతో సదరు ఇంటి వారితోపాటు స్థానికులు సైతం భయాందోళనకు గురయ్యారు. ప్రహరీ కూలిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ విషయమై టీపీఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఈ భవనానికి సంబంధించిన దరఖాస్తు తన వద్దకు రాలేదని, నేను పరిశీలిస్తానని తెలిపారు.టీపీవో కరుణాకర్‌కు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఇదీ పరిస్థితి..

నగరంలో చాలావరకు ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని షాపింగ్‌కాంప్లెక్స్, ఆస్పత్రులు నిర్మిస్తున్నట్లు సమాచారం. భవనం నిర్మాణంలో ఒక రకంగా అనుమతి ఉంటే, నిర్మాణం పూర్తి చేసిన తర్వాత అందులో వేరే రకంగా కార్యకలపాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నిర్మాణ సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవడంలేదని తెలుస్తోంది. ఇళ్లు లేదా కమర్షియల్ కోసం అనుమతి చేసుకున్న సమయంలో దరఖాస్తులు పరిశీలించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. భారీ ఎత్తున ముడుపులు అందుకొని నిబంధనలను తుంగలో తొక్కి మరీ అనుమతులు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలా గత ఏడాది, రెండేళ్ల నుంచి ఖలీల్‌వాడీ, ప్రగతినగర్, ద్వారక్‌నగర్, వినాయక్‌నగర్, ఆర్యగనర్, గంగాస్థాన్, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు సాగుతున్నాయి. ఓ భవనంలో సెల్లార్ నిర్మించాలంటే కచ్చితంగా నిబంధనల ప్రకారం 750 గజాలపైనే స్థలం ఉండాలి. దీంతో పాటు 60ఫీట్ల రోడ్ ఉండాలి. కానీ నగరంలో మాత్రం 200గజాల నుంచి 500గజాల లోపు చేపట్టిన నిర్మాణాల్లో అక్రమంగా సెల్లార్లు నిర్మిస్తున్నారు. అయినా ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిసిన మౌనంగా ఉండడంపై అందరికీ అనుమానాలు వస్తున్నాయి. మున్సిపల్‌కు సంబంధించిన లైసెన్సు ఇంజినీర్‌లే అన్ని తామై చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నగరంలో నిర్మాణాలు చేపడుతున్న నిర్వాహకులు కనీస జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దని ఏఎస్సై రమేష్ తెలిపారు. మండలకేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో గురువారం డ్వాక్రా సంఘాల మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఐకేపీ ఏపీఎం మోహన్, సీసీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందించాలి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.19,500 అమలు చేయాలని బీఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ పేర్కొన్నారు. నగరంలోని కార్మికశాఖ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీవో నెంబర్ 60ను అమలు చేయకుండా మున్సిపల్ కార్పొరేషన్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు శ్రమ దోపిడీకి పాల్పడున్నదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ 19500 అమలు చేయకుంటే సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరించారు. నాయకులు మేకల రాజేందర్, రాహుల్, హరీష్, యాదయ్య, శ్రీశైలం, వసంత్, మురళి, గోపాల్, రాజేశ్వర్, సహదేవ్, సతీష్, శివలింగం పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం



తెయూ(డిచ్‌పల్లి):తెలంగాణ యూనివర్సిటీలో గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూలో వీసీ గెస్ట్‌హౌజ్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలియజేయగా ఐదుగురు విద్యార్థి నాయకులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేస్తూ వర్సిటీ యాజమాన్యం నిర్ణయించడం సిగ్గు చేటన్నారు. వెంటనే ఐదురుగు విద్యార్థి నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేష్, చిత్రు, అరవింద్, కృష్ణ, రాకేష్, రోషన్ ఉన్నారు.

అక్రమ కేసులను తొలగించాలి



నిజామాబాద్‌అర్బన్: ఏబీవీపీ నాయకులపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే తొలగించాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం వారు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లోని సమస్యలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పాఠశాలల బంద్ నిర్వహించగా, పోలీసులు తమను అడ్డుకొని అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. ప్రభుత్వం స్పందించి పెట్టిన కేసులను వెంటనే తొలగించాలని, ప్రయివేటు స్కూళ్లలో అధిక ఫీజులతో పాటు, స్కూళ్లలో పుస్తకాలు డ్రెస్సులను అమ్ముతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శశి, సునీల్, జగదీష్, దుర్గదాస్, ప్రవీణ్, అనిల్ పాల్గొన్నారు.

నీట్ నిర్వహణ రాష్ట్రాలకే ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని మార్పులు చేసి అమలు చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు శంతన్, బాలయ్య, పెంటన్న కిషన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్‌అర్బన్: గత ఇరవై ఏళ్లుగా తన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని, అర్బన్‌లో నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నదే తన లక్ష్యం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని దుబ్బ, శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ధన్‌పాల్ లక్ష్మీభాయ్-విఠల్‌గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వార విద్యార్థులకు ఉచిత పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూర్ నగరంలో ఉన్న అన్ని ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలకు తన ట్రస్ట్ ద్వారా ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు మహనుభావులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అదిరోహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. దుబ్బ హైస్కూల్‌లో విద్యార్థులకు బెంచీలు, ఫర్నీచర్ అందజేశారు. డీఈవో దుర్గాప్రసాద్, ఎంఈవో రామారావు, కార్పొరేటర్ బంటు వైష్ణవి, రాము, హెచ్ఎం రాంచందర్‌గైక్వాడ్, వసుదేవరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కన్వీనర్ వీణరాణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోల్ల లక్ష్మీనారాయణ, సురేష్, ప్రవళిక, సుధీర్, రాజు, సాయిరాం, బద్దం కిషన్, గద్దం రాజు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్‌అర్బన్: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియన్(ఎస్ఎస్ఏ) మండల విద్యా వనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈమేరకు గురువారం నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. తమకు మినిమం పేస్కేల్ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని కోరారు. రాష్ట్ర మండల విద్యావనరుల కేంద్రం మెసెంజర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఆఫ్సర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గైక్వాడ్, మెసెంజర్ యూనియన్ సభ్యులు ఉన్నారు.

సమాచారం..

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధించుటకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, గణితం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించుటకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, సెల్ఫ్ వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 2 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4న నిజామాబాద్‌లోని జీజీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే డెమో ఇంటర్వ్యూకు అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు.

వంట మనిషి పోస్టులకు..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో వంట మనిషి పోస్టుల భర్తీ కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్/కాలేజ్ ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సవిత ఒక ప్రకటనలో కోరారు. కేజీబీవీలో హెడ్‌కుక్ -1, అసిస్టెంట్ కుక్-2 పోస్టులు ఖాళీగా ఉండగా, మోడల్ స్కూల్/కాలేజ్ బాలికల హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్ -1 పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి చదివి ఉండాలని, జూలై 2లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 6305148916 (కేజీబీవీ, ఎస్‌వో), 9032513913 (మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్)ను సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తం

మహిళకు వీల్‌చైర్ అందజేత

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పోచమ్మగల్లిలో అర్థరైటీస్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు గురువారం లయన్స్‌క్లబ్ వారి సహకారంతో మేయర్ నీతూకిరణ్ వీల్‌చైర్‌ను అందజేశారు. క్లబ్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్అండ్‌బీ గెస్టహౌజ్‌లో గురువారం ఉద్యమ నాయకుడు బొజ్జా తారకం జయంతిని జిల్లా మాల మహానాడు, ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలువేసి సంతాపం తెలిపారు. మాల మహానాడు ప్రతినిధులు ఎల్లయ్య, నాగరాజు, ధన్‌రాజ్, గంగాధర్, పద్మారావు, సాయిలు, పాపయ్య, రాంమోహన్‌రావు, సూర్యశివాజీ, నాగయ్య, శిల్ప లింగం, రామచందర్, అనిల్ కుమార్ ఉన్నారు.

కార్తీక్‌నాయక్‌కు సన్మానం

జక్రాన్‌పల్లి: కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన మండలంలోని వివేక్‌నగర్ తండాకు చెందిన సునావత్ రమేష్ కార్తీక్ నాయక్‌ను గురువారం బంజార సంఘ నాయకులు సన్మానించారు. జిల్లా బంజారా సంఘం అధ్యక్షుడు చంద్రు నాయక్, ఆల్ ఇండియా బంజారా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ తారాచంద్ నాయక్, నాయకులు విఠల్ రాథోడ్, కొర్ర గంగాధర్, జితేందర్‌నాయక్, గమ్య, రాంసింగ్, శంకర్, రాములు, లోక్యా, రాంజీ, మాత్య, మోజీరాం, రవి, అర్గుల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, వైస్ చైర్మన్ నడ్పి రాజన్న,కార్యదర్శి తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు మోజీరాం, మేకల రవీందర్‌పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం మాదిగ దండోర రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను నగర అధ్యక్షుడు సుధాకర్, నాయకులు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ.. జూలై 7న హైదరాబాద్‌లో మాదిగ హక్కులు, ఉద్యమాలు, సమస్యలు తదితర వాటిపై రజతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు పోసాని, నాయకులు బాబురావు, మోతేభూమన్న, రవీ, నర్సింగ్‌రావు, శంకర్, కవిత, అనిత, సునిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

ఇందల్వాయి: మల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తోట రాజన్నకు ఇన్‌ఫెక్షన్ కారణంగా జీజీహెచ్ వైద్యులు కాలు తొలగించారు. దీంతో గురువారం బాధితుడిని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. నాయకులు రఘునందన్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా లక్ష కుంకుమార్చన



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం లలితాదేవి ఆశ్రమాలయంలో గురువారం లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో పంచముఖ దుబ్బ రాజేశ్వరస్వామి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములను ప్రతిష్ఠించి 21 వసంతములు పూర్తయినందున సందర్భంగా ఈకార్యక్రమం నిర్వహించారు. అలాగే గణపతి పూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, శ్రీలలితా మహాత్రిపుర సుందరీ దేవతా ప్రీత్యర్థం సామూహిక సుహాసినీల చేత లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం పంచముఖ దుబ్బరాజేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, 12 జ్యోతిర్లింగాలకు 12 మంది దంపతులచే రుద్రక్రమార్జన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి



ఖలీల్‌వాడి: నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై విచారణ చేపట్టి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ ముట్టడికి జాతీయ కార్యవర్గం పిలుపునివ్వగా గురువారం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా అధ్యక్షులు విక్కి యాదవ్ ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని నాగారంలో గురువారం ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సెలింగ్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను అఖిల భారత రైతుకూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30న నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సెలింగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. రైతు ఆత్మహత్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. నాయకులు అబ్బయ్య, సంపత్, శంకర్, రామకృష్ణ, రామ్మోహన్ రావు, రాజేశ్వర్, యాది పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు

మోపాల్: డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుందని ఏఎస్సై రమేష్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ముదక్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు గమనించాలని, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.



పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి సీఈఐఆర్ ద్వారా ఫోన్లు అందజేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ గురువారం తెలిపారు. ఫోన్లు గుర్తించుటలో ప్రతిభ కనబర్చిన మహిళ కానిస్టేబుల్ సుమలతను టౌన్ సీఐ నరహరి అభినందించారు.

నేటి చిత్రం..



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్తను తొలగించరూ..

నగరంలోని గోల్‌హనుమాన్ నుంచి పూలాంగ్‌కు వెళ్లేదారిలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. అలాగే పక్కనున్న డ్రెయినేజీ మురికినీటితో నిండిపోయి కుంటలాగా ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్తను తొలగించి, డ్రెయినేజీని శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మా భూములను రక్షించండి



డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

డిచ్‌పల్లి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో భూపంపిణీలో భాగంగా మండలంలోని మెంట్రాజ్‌పల్లి శివారులోగల 246 సర్వే నెంబర్‌లో తమకు ఇచ్చిన భూములను రక్షించాలని బాధిత రైతులు కోరారు. తమ భూములను కొందరు కబ్జాచేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు గురువారం పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి, తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో 4వ విడత భూపంపిణీలో భాగంగా తమ భూములకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి భూమిని చదును చేసి బోరు మోటార్లు వేసుకుని పంటలు సాగు చేస్తున్నామన్నారు. గురువారం తమ సాగు భూముల్లో కొందరు వచ్చి సర్వే చేస్తున్నారని, వారిని అడిగితే పల్లె సాయికుమార్, పల్లె శ్రీనివాస్ తమకు ఈ భూములు అమ్మినట్లు చెబుతున్నారని తెలిపారు. తాము కొన్ని సంవత్సరాలుగా కబ్జాలో ఉండి పంటలు సాగు చేస్తున్నామని తమ వద్ద పట్టాలు సైతం ఉన్నాయన్నారు. తమకు న్యాయం జరిగేలా ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. రైతులు సుప్రియ, సాయిలు, లక్ష్మి, గంగామణి, చిన్న ఒడ్డెన్న, సావిత్రి, రాజమణి, శాంత, పోసాని, కర్రెవ్వ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌రూరల్: మండలంలోని సారంగాపూర్‌లోగల ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలని బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, సారంగాపూర్ డైరీఫారం నిర్వహకుడు అక్బర్ నవాజొద్దీన్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన నార్త్ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. నవాజొద్దీన్ మాట్లాడుతూ.. డైరీఫారం, వాటర్ ట్యాంక్ పక్కన గల ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పేదలకు అమ్ముతున్నారన్నారు. ఇంతకుముందు ప్రభుత్వ అధికారులు అట్టి భూమిని సర్వే చేసి హద్దులను ఏర్పాటుచేసి స్వాధీనపరుచుకున్నారని వివరించారు. ఈ సర్వే నెంబర్‌లో దొంగ పట్టాలను తయారుచేసి స్థలంను అమ్ముకోవడంతో పాటు ప్రభుత్వ భూమి కబ్జా చేసుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆ భూమిలో ఉన్న పది ఇళ్లను డ్యాకుమెంట్ పట్టాలను స్వాధీనపరుచుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు ఆఫ్సర్, రాజు, అలీ , గులాబ్‌సింగ్, తదితరులుపాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



మోపాల్: మండలకేంద్రంలోని కుర్మ సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సంఘ సభ్యులు కోరారు. ఈమేరకు వారు గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. సంఘ అధ్యక్షుడు దండు నర్సయ్య మాట్లాడుతూ.. సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి కేటాయించాలన్నారు. గ్రామంలో నెలకొన్న పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. సంఘ నాయకులు అగ్గు ఎర్రన్న, ద్యాప రవి కుమార్, గోవర్ధన్, బండమీద నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీలో న్యాయం చేయాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియలో ఇటీవల విధుల నుంచి తొలగించిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వారికి అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఈమేరకు వారు గురువారం ఏవో చందర్‌కు విన్నవించారు. కరోనా సమయంలో జీజీహెచ్‌లో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించామన్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,700	వెండి (కిలో)	91,000
22 క్యారెట్స్	67,062		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	80	100	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	90	గోబిపువ్వు	60	80
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	70	90
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	90
క్యాప్సికం	60	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ (తెలుగు)-8.30 .12.05.3.40.7.15.10.50
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ (తెలుగు) -8.45. 3.05.6.40
	కల్కి-2808 ఏడీ(హిందీ)- 10.15
స్క్రీన్-3	కల్కి-2898ఏడీ (తెలుగు) -8.50. 12.25.4.00.7.35.11.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-5.50. 9.20.12.5.4.20.7.50. 11.20
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) -6.10. 9.40.3.30.7.00. 10.30
	ఇన్‌సైడ్ అవుట్-2(3డీ ఇంగ్లీష్)-1.10
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(తెలుగు)-5.40. 9.10.12.40.7.10.10.40
	మహారాజ(తెలుగు)- 4.10
స్క్రీన్ -4	కల్కి-2898 ఏడీ(తెలుగు)-5.30. 9.00.12.30
	కల్కి-2898 ఏడీ(హిందీ)- 6.45.10.15
దేవి	కల్కి-2898 ఏడీ(తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)